

జిల్లా సెలెక్షన్స్ రద్దు

పెదవేగి : పెదవేగి గురుకులంలో ఈనెల 4న జరగాల్సిన అండర్‌-19 జిల్లా జట్ల ఎంపికను రద్దు చేసినట్టు స్మాల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాలకొల్లు అర్బన్ : వడ్లవానిపాలేనికి చెందిన టెన్త్ విద్యార్థి ఎం.నాగ ఆదిత్య యోగాసన పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు.

మల్లన్నకు జలాభిషేకం



మొగల్తూరు : స్థానిక వడయార్‌పేటలోని భ్రమరాంభ సమేత వనమల్లికార్జున స్వామి ఆలయంలో జలాభిషేకం చేశారు. 108 కావిళ్లతో జలాలను తీసుకువచ్చి అభిషేకించినట్టు భక్తులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఎన్టీఆర్ జిల్లాకు 22 బోట్లు



బోట్లు పంపిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో)/పోలవరం (రూరల్): భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న ఎన్టీఆర్ జిల్లాకు ఏలూరు జిల్లా నుంచి 22 బోట్లను పంపించినట్టు జిల్లా మత్స్య శాఖాధికారి నాగలింగాచారి తెలిపారు. కలిదిండి నుంచి 15, కైకలూరు నుంచి 5, పట్టిసీమ ఫెర్రీ నుంచి 2 పడవలు పంపామని, వీటిలో 20 దేశీయ పడవలు, 2 ఫైబర్ బోట్లు ఉన్నాయన్నారు.

ముంపు ప్రాంతాల్లో వైద్య సేవలు

నూజివీడు: జిల్లాలో భారీ వర్షాలతో ముంపు బారిన పడిన ప్రజలను తరలించిన పునరావాస శిబిరాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటుచేసినట్టు డీఎంహెచ్‌ఓ శర్మిష్ఠ సోమవారం తెలిపారు. నూజివీడులోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్, ఎస్ఆర్ఆర్ హైస్కూల్, అప్పారావుపేట ప్రాథమిక పాఠశాలల్లో శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే పెదపాడు మండలం అప్పనవీడు, గోగుంటలో శిబిరాలు నిర్వహిస్తున్నామని, 8 మంది వైద్యులు, 45 మంది సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 390 మంది బాధితులకు వైద్య సేవలందించినట్టు చెప్పారు. మరిన్ని రోజులు శిబిరాలు కొనసాగుతాయన్నారు.

3,977 హెక్టార్లలో వరికి నష్టం

ఏలూరు (మెట్రో) : భారీ వర్షాలకు జిల్లాలో వరి, పత్తి, మినుము పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక నివేదిక సిద్ధం చేసింది. జిల్లాలో 69,222 హెక్టార్లలో వరి సాగులో ఉండగా 3,977.7 హెక్టార్లలో పంట నీట మునిగినట్టు నిర్ధారించారు. అలాగే 0.81 హెక్టార్లలో మొక్కజొన్న, 149 హెక్టార్లలో పత్తి, 6.48 హెక్టార్లలో చెరకు, 6.1 హెక్టార్లలో పెసలు, 634.6 హెక్టార్లలో మినుము, 7.69 హెక్టార్లలో వేరుశనగ పంటలు నీట మునిగాయన్నారు. వర్షాల కారణంగా 11,454 మంది రైతులకు చెందిన పంటలు నీటమునిగాయని వ్యవసాయశాఖ జేడీ షేక్ హబీబ్ బాషా తెలిపారు.

నేడు నాలుగు మండలాల్లో బడులకు సెలవు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో వరద ప్రభావం నుంచి తేరుకోని నాలుగు మండలాల్లో పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటించినట్టు డీఈఓ ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, నూజివీడు మండలాల్లో సెలవు ప్రకటించామని, మిగిలిన మండలాల్లో యథావిధిగా పాఠశాలలు పనిచేస్తాయన్నారు.

వేతనాల కోసం గళమెత్తిన స్వీపర్లు




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్వీపర్లు


ఏలూరు (టూటౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ (టాయిలెట్ క్లీనర్స్) 1,900 మందికి బకాయి వేతనాలు రూ.4.45 కోట్లు తక్షణమే ఇప్పించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన ధర్నాకు యూటీఎఫ్ రాష్ట్ర నేత పీవీ నరసింహారావు మద్దతు తెలిపారు. యూనియన్ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు తదితరులు మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లు రూ.6 వేల నామమాత్రపు వేతనాలపై పనిచేస్తున్నారని, వారికి ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అనంతరం స్వీపర్లు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్వో, డీఈఓలకు అందజేశారు. డీఈఓ అబ్రహం మాట్లాడుతూ వారంలో వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు జాబ్ మేళాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జిల్లాలోని బుట్టాయగూడెం, ఏలూరులో మంగళవారం జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే మేళాలో 160 మందికి, ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే మేళాలో 110 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు ఏలూరులో 8978524022, 8919608183 (9988853 335 టోల్ ఫ్రీ), బుట్టాయగూడెంలో 90008 03414, 96663 22032, (99888 53335-టోల్ ఫ్రీ) నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్, నాయకులు



ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

సంక్షేమ శేఖరుడికి మహో నివాళి



చింతలపూడి : చింతలపూడిలో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న సమన్వయకర్త కంభం విజయరాజు, నాయకులు

ప్రతి మదిలో.. జనహృదిలో..

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- అన్ని నియోజకవర్గాల్లో సంస్మరణ, సేవా కార్యక్రమాలు
- పేదల హృదయాల్లో గూడు కట్టుకున్న రాజన్న
- వైఎస్‌తో అనుబంధం, ఆయన చేసిన మేలును గుర్తుచేసుకున్న నేతలు



దెందులూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

సాక్షి ప్రతినిధి,ఏలూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు ఏలూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సోమవారం జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు వైఎస్సార్ అభిమానులు సేవా కార్యక్రమాలు, సంస్మరణ సభలు నిర్వహించారు.

- ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ నేతృత్వంలో వైఎస్ విగ్రహానికి పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. నగర నేత మామిళ్లపల్లి జయప్రకాష్, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల, గుణ్ణంపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి తానేటి వనిత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కైకలూరులో సంత మార్కెట్ సెంటరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, కైకలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దూలం నాగేశ్వరరావు నేతృత్వంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అన్ని మండలాల నేతలు హాజరయ్యారు.
- చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు నేతృత్వంలో జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట, చింతలపూడి మండలాల్లో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- దెందులూరులోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నేతృత్వంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.
- నూజివీడులోని ద్వారకా ఎస్టేట్‌లో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బుట్టాయగూడెం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఆహారం అందించారు. కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల్లో నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.



కొయ్యలగూడెం : రోగులకు ఆహారం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



నూజివీడు : రోగులకు పండ్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కైకలూరు : పులిహోర పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

ఏలూరుకు తమ్మిలేరు ముప్పు

- లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు
- అప్రమత్తమైన అధికారులు
- శనివారపుపేట కాజ్‌వేపైకి మూడు అడుగుల మేర వరద
- కొల్లేరులోకి భారీగా వరద నీరు విడుదల



ఏలూరులో తంగెళ్లమూడి వద్ద ఉధృతంగా తమ్మిలేరు

ఏలూరు (టూటౌన్): తమ్మిలేరు వరద ఏలూరు వాసులను భయపెడుతోంది. తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నగరానికి రెండు వైపులా ప్రవహించే తమ్మిలేరు ఇప్పటికే పలు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. తంగెళ్లమూడి ప్రాంతంలో ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శనివారపుపేట కాజ్‌వేపైన మూడు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిపేశారు. ఈ మార్గంలోకి వచ్చేందుకు టీటీడీ కల్యాణమండపం రోడ్డులోని గ్లేవియర్ నగర్ మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొల్లేరులోకి భారీగా వరద నీరు

నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు జలాశయం నుంచి పెద్ద ఎత్తున దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఏలూరు నగరానికి తూర్పు పడమరగా విస్తరించిన తమ్మిలేరు నుంచి రెండు లాకుల వద్ద పెద్ద ఎత్తున వరద నీటిని కొల్లేరులోకి విడుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది వరద పరిస్థితి సమీక్షిస్తున్నారు.

తమ్మిలేరు కాజ్‌వేకు గండి

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట వద్ద తమ్మిలేరు కాలువ వాగు కాజ్‌వేకు సోమవారం మళ్లీ గండి పడింది. వాగుకు వరద వచ్చినపుడల్లా గండికి తాత్కాలికంగా మరమ్మతులు చేయడంతో తరచూ గండిపడుతోంది. శాశ్వత మరమ్మతుల కోసం నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ప్రారంభించలేదు. నెల క్రితం వాగుకు వరద రావడంతో మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. మూడు రోజుల నుంచి భారీగా వరద రావడంతో కాజ్‌వేకు మళ్లీ గండి పడింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ఉధృతంగా తమ్మిలేరు

చింతలపూడి: భారీ వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది. సోమవారం అధికారులు తమ్మిలేరు మూడు గేట్ల ద్వారా 3,839 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 347.42 అడుగులకు, గోనెలవాగు బేసిన్ 347.39 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగా 1,736 టీఎంసీలకు చేరుకున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా బేతుపల్లి అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 4,006 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాల్వ ద్వారా ప్రాజెక్టులోకి వస్తోంది.



ఏలూరు అమీనాపేట కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు



చిన్నంపేట వద్ద తమ్మిలేరు కాజ్‌వేకు గండిని పరిశీలిస్తున్న తహసీల్దార్

వరద బాధితులను ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో గండిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పట్టణంలోని పెద్ద చెరువుకు గండ్లు పడి వరద ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. పట్టణంలోని పెద్ద చెరువుకు పడిన గండిని పరిశీలించిన అనంతరం 32వ వార్డులో ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. దాదాపు 50 ఇళ్లలోని కుటుంబాలు వరద బారిన పడ్డాయని, ఇళ్లలో ఫర్నిచర్, సరుకులు పాడయ్యాయని, అంతటా ఎర్రమట్టి పేరుకుపోయిందన్నారు. నూజివీడులో గత 50 ఏళ్లలో ఒకే రోజు ఇంత పెద్ద ఎత్తున వర్షం కురవలేదని, పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు వెంటనే నష్టపరిహారం అందించాలన్నారు. అలాగే పలు రోడ్లు గండ్లు పడ్డాయని, బైపాస్ రోడ్డు మార్జిన్ దెబ్బతిందని, వెంటనే పునరుద్ధరించాలన్నారు. నియోజకవర్గంలో దాదాపు 4,500 ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయని, రైతులు భారీగా దెబ్బతిన్నారన్నారు. రైతులకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కౌన్సిలర్ నొడు నాగమల్లేశ్వరరావు, నాయకులు పగడాల సత్యన్నారాయణ, సలుమూరి మూర్తి, బసవా వినయ్, పిళ్లా చరణ్ తదితరులు ఉన్నారు.

వరదను ఎదుర్కొనేందుకు సిద్ధం



ఆహార పొట్లాల లారీ వద్ద కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): తమ్మిలేరు, ఎర్రకాలువ వరద ఉధృతితోపాటు గోదావరి వరదకు సంబంధించి మొదటి ప్రమాద హెచ్చరిక వచ్చే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఏలూరులో ఆహార తయారీని పరిశీలించి అనంతరం ఆహార పొట్లాలను విజయవాడకు ప్రత్యేక వాహనంలో తరలించారు. ఉదయం 7 గంటలకే లక్ష పాల ప్యాకెట్లను, మధ్యాహ్నం నాటికే 55 వేల ఆహార పొట్లాలు, సాయంత్రం మరో 70 వేల పొట్లాలు పంపించామన్నారు. ఉదయం లక్ష బిస్కెట్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. 50 వేల కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు కూడా కలెక్టరేట్‌కు చేర్చామన్నారు.

వ్యభిచార గృహ నిర్వాహకురాలికి జైలు

ఏలూరు (టూటౌన్): వ్యభిచార గృహం నిర్వహిస్తున్న మహిళకు ఐదో అదనపు జిల్లా మహిళా కోర్టు న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం గునుపూడిలో 2020లో కొంతమంది మహిళలు, యువతులతో ఓ ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రగడ సాయికుమారిని భీమవరం వన్‌టౌన్ పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుంచి కేసు విచారణ కొనసాగుతుంది. తుది విచారణ అనంతరం జడ్జి రాజేశ్వరి తీర్పు వెలువరించారు.